నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 | హైదరాబాద్,ఆదివారం 10 మార్చి 2024 | VIKARABAD

ఓటింగ్ శాతం పెరిగేలా..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణను మొదలెట్టిన ఈసీ

- ఓటు నమోదుకు మరోసారి అవకాశం
- గత అసెంబ్లీ ఎన్నికల్లో తగ్గిన పోలింగ్ శాతం
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కలెక్టర్ ఆదేశం
- ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర స్వీప్ కన్సల్టెంట్ భవానీశంకర్

రంగారెడ్డి, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదు కావడంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కార్యాచరణను మొదలెట్టింది. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటర్లుగా వారి పేర్లను నమోదు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఓటు నమోదుకు అవకాశం కల్పించిన ఈసీ యువతకు మరో అవకాశాన్ని ఇచ్చింది. అలాగే.. సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. ఓటింగ్ సందర్భంగా ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపైనా అధికారులు దృష్టి సారించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో 59.96 శాతమే..

గతేడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా..పట్టణాల్లోని ఓటర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూపలేదు. 2018 ఎన్నికల్లో 62% పోలింగ్ కాగా.. తాజా ఎన్నికల్లో 59.96 శాతమే నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే..2 శాతానికి పైగా ఓటర్లు తగ్గారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 74.93%, ఎల్బీనగర్‌లో 49.07%, మహేశ్వరం లో 55.39%, రాజేంద్రనగర్‌లో 55.83%, శేరిలింగంపల్లిలో 48.75%, చేవెళ్ల లో 74.18%, కల్వకుర్తిలో 83.26%, షాద్‌నగర్‌లో 82.09% పోలింగ్ నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడంతో ఈసారి అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటర్లుగా పేర్లు నమోదు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కొత్తగా ఓటు నమోదుకు అవకాశం..

ఇటీవల రెండుసార్లు ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను జిల్లా అధికారులు విడుదల చేశారు. అర్హులైన వారందరూ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు ఎన్నికల సంఘం తాజాగా మరోసారి అవకాశం కల్పించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీయువకులు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు జాబితాలో మార్పులు, చేర్పులు, అనర్హుల పేర్లను తొలగించుకోవచ్చు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో ఫారాలను పూర్తి చేసి అందజేసేలా బీఎల్‌వోలు శ్రద్ధ తీసుకుంటున్నారు. నామినేషన్ల ఘట్టానికి పదిరోజుల ముందు వరకూ ఈ ప్రక్రియ కొనసాగనున్నది. ప్రస్తుతం జిల్లాలో 35,91,987 మంది ఓటర్లుండగా.. స్వీప్ కార్యక్రమంలో ఓటు హక్కుతోపాటు ఓటు వినియోగంపైనా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో రాష్ట్ర స్వీప్ కన్సల్టెంట్ భవానీశంకర్ పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు యువతను చైతన్యం చేసి ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకునేలా అన్ని విద్యాసంస్థల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా ఓటింగ్ సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా 1,500 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఓట్లు ఉంటే సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 3,369 పోలింగ్ కేంద్రాలుండగా...ఈ సంఖ్య లోక్‌సభ ఎన్నికల నాటికి మరింతగా పెరిగే అవకాశం ఉన్నది.

ప్రస్తుతం జిల్లాలో ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	ఎన్ఆర్ఐ	సర్వీసు ఓటర్లు	మొత్తం
ఇబ్రహీంపట్నం	1,69,713	1,67,298	36	32	55	3,37,134
ఎల్బీనగర్	3,12,163	2,88,153	134	52	50	6,00,552
మహేశ్వరం	2,84,913	2,70,996	69	59	73	5,56,110
రాజేంద్రనగర్	3,10,863	2,88,684	38	102	91	5,99,778
శేరిలింగంపల్లి	3,95,460	3,52,069	144	34	50	7,47,757
చేవెళ్ల	1,35,261	1,33,820	06	05	74	2,69,166
కల్వకుర్తి	1,22,805	1,20,148	09	02	134	2,43,098
షాద్‌నగర్	1,19,114	1,19,211	13	0	54	2,38,392
మొత్తం	18,50,292	17,40,379	449	286	581	35,91,987

మరింత ఆసరా.. ఎటు?

- మూన్నెళ్లైనా ఊసేలేదు..
- అధికారంలోకి రాగానే పెంచుతామని ప్రగల్భాలు
- ఆరు గ్యారెంటీలంటూ మిగిలిన వాటిని పట్టించుకోని ప్రభుత్వం
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆలస్యంగా పింఛన్ల అందజేత

అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్లు పెంచుతామని నమ్మబలికిన కాంగ్రెస్.. మూడు నెలలు దాటినా వాటి ఊసెత్తడం లేదని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఆవేదన చెందుతున్నారు. నమ్మి ఓటేస్తే నట్టేట ముంచిండ్రని దిగులుచెందుతున్నారు.. ఊ... అంటే... ఆ... అంటే... ఆరు గ్యారెంటీలు అంటారేగాని... పండుటాకుల పరేషాన్‌ను తీర్చాలన్న ధ్యాసలేదని పలువురు ఘాటుగా విమర్శిస్తున్నారు... బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఠంచన్‌గా పింఛన్లు వచ్చేవని... కాంగ్రెస్ వచ్చిన కాడి నుంచి ఆలస్యంగా పింఛన్ డబ్బులు ఇస్తున్నారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పింఛన్లు పెంచి అండాదెరువు లేనివాళ్ల గోసను తీర్చాలని వేడుకుంటున్నారు.

ఇంకా పాత పింఛన్లే..

వికారాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కి వచ్చి మూడు నెలలు దాటినా.. పేదలకు ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరడం లేదు. పాలకులు కేవలం ఆరు గ్యారెంటీలను మాత్రమే ప్రస్తావిస్తూ మిగతా వాటి ఊసే ఎత్తడంలేదు. ఆసరా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను పెంచుతామని ఇచ్చిన హామీని రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తదితరులకిచ్చే రూ.2016 పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ. 4000 నుంచి రూ. 6000 పెంచుతామన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓటేసి గెలిపించిన పింఛన్‌దారులు తమ పింఛన్ డబ్బుల పెంపు ఎప్పుడో అంటూ ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆరు గ్యారెంటీలంటూ ప్రచారం చేస్తున్నా.. వాటి అమలుకు తెల్లరేషన్ కార్డును తప్పనిసరి చేయడంతో చాలా మంది పేదలు పథకాలకు దూరమవుతున్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడంలేదు. అదేవిధంగా ఆసరా లబ్ధిదారులకు పాత పిం ఛన్లనే అందిస్తున్నారు. డబ్బుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో

పండుటాకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా 20వ తేదీలోగా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను అందించగా.. ప్రస్తుతం 20 రోజులు ఆలస్యంగా పింఛన్ డబ్బులు వారికి పంపిణీ చేస్తున్నారు.

సీఎం సొంత నియోజకవర్గంలో తీవ్ర జాప్యం..

సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆసరా పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి. పింఛన్ డబ్బులతోనే బతుకుతున్న పండుటాకులు, దివ్యాంగులు, వితంతువులకు డబ్బుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు పింఛన్ డ బ్బుల పంపిణీ ప్రతినెలా 29 లేదా 30 తేదీన ప్రారంభమై వారం రోజుల్లో పూర్తవుతుండగా.. కొడంగల్ సెగ్మెంట్‌లోని పింఛన్‌దారులు మాత్రం గత నెల పింఛన్ డబ్బుల కోసం ఈ నెల రెండో వారం వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెల కొనడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ అంశం జిల్లాలో చర్చానీయాంశంగా మారింది. అయితే కొడంగల్ సెగ్మెంట్‌కు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఆసరా పింఛన్ల నిమిత్తం నిధులు మంజూరవుతుండగా...మిగతా వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలకు రంగారెడ్డి జిల్లా నుంచి నిధులు మంజూరవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 98,793 మంది పింఛన్‌దారులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.24.38 కోట్ల డబ్బులను పంపిణీ చేస్తున్నది.

కేసీఆర్ హయాంలో.. ప్రతినెలా ఠంచన్‌గా..

కేసీఆర్ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అండగా నిలవడంతోపాటు దేశంలో ఎక్కడాలేని విధంగా పింఛన్ డబ్బులను పెంచింది. వృద్ధులు, వితంతువులకు ఇచ్చే ఫించన్‌ను రూ.200 నుంచి రూ.1000లకు..దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌ను రూ.500-1500 పెంచింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆసరా పింఛన్లను రూ.1000-రూ.2016లకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.1500- రూ.3016లకు.. తదనంతరం దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు గతేడాది జూన్‌లో రూ.4016లకు పెంచి పేదల సర్కారుగా కేసీఆర్ ప్రభుత్వం నిలిచింది. బీఆర్ఎస్ హయాంలో పింఛన్ల నిమిత్తం జిల్లాలో రూ.1100 కోట్లకుపైగా ఖర్చు చేసింది.

తాండూరులో జైపూర్, కెలిఫర్ అమరిక క్యాంపు

తాండూరు, మార్చి 9 : తాండూరులో దివ్యాంగులకు ఉచిత జైపూర్ కాళ్లు, కెలిఫర్ కాళ్ల అమరిక క్యాంపు నిర్వహిస్తున్నట్లు తాండూరు మార్వాడీ యువమంచ్ ప్రతినిధులు తెలిపారు. మార్వాడీ యువమంచ్, ఆర్‌బీవోఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12, 13వ తేదీల్లో తాండూరు పట్టణం బాలాజీ మందిర్‌లో క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 200ల మందికి చికిత్సలతో పాటు ఉచితంగా జైపూర్, కెలిఫర్ అమరిక జరుగుతున్నదన్నారు. పూర్తి వివరాలకు 9989495561, 9885934446 సంప్రదించాలని పేర్కొన్నారు.

శబ్దకాలుష్యంతో ఇబ్బందులు

- సుమోటోగా స్వీకరించిన హైకోర్టు డివిజన్ బెంచ్
- 14న కోర్టుకు హాజరుకావాలని ఫంక్షన్‌హాల్ యజమానులకు నోటీసులు

నాంపల్లి కోర్టులు, మార్చి 9 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో అధిక శబ్దకాలుష్యంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు ఆర్మీ అధికారి సతీశ్ భరద్వాజ్ రాసిన ఉత్తరాన్ని తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ సుమోటోగా పరిగణించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సమక్షంలో విచారణను ప్రారంభించింది. వివరాల్లోకి వెళితే.. పెండ్లిలు, శుభకార్యాలకు డీజే, ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయడం వల్ల శబ్దకాలుష్యానికి దారితీస్తున్నదని ఆర్మీ అధికారి భరద్వాజ్ పేర్కొన్నారు. అదేవిధంగా పటాకులు పేల్చడం, రోడ్డుపైనే వాహనాలను పార్క్ చేయడం, బీరుసీసాలు, మందుబాటిళ్లు, తినుబండారాల కవర్లు, చెత్తను పరిసర ప్రాంతంలోనే చెల్లాచెదురుగా పడేసినా ఫంక్షన్ హాళ్ల యజమానులు పట్టించుకోవడం లేదని కోర్టుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. తాడ్‌బండ్ ప్రాంతంలో ఇండ్ల మధ్యలోనే బంటియా, ఇంపీరియల్ గార్డెన్స్ ఉన్నాయని, అధికంగా జనావాసాలు ఉండడంతో కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని లేఖలో వివరించారు. కాగా శబ్ద కాలుష్య నివారణకు పోలీసు అధికారులు జీఓ నం.170, 2010ని అమలు చేయడంలేదా అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. గతంలో ఫంక్షన్‌హాళ్లకు రూ.10వేల జరిమానా విధించడం కూడా జరిగిందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. జరిమానాతో మార్పేమీ లేదని, యజమానులకు నోటీసులు జారీ చేయాలని బోయిన్‌పల్లి పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 14న ఫంక్షన్‌హాళ్ల యజమానులు కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.

పిల్లలకు ఆరోగ్య రక్షణగా టీకాలు

- 10 ఏండ్ల వరకు దశలవారీగా వేయించాల్సిందే
- సర్కార్ దవాఖానల్లో ఉచితంగానే పంపిణీ
- సకాలంలో వ్యాక్సినేషన్‌తో 90శాతం వ్యాధులు దూరం

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ): చిన్నారులకు పుట్టినప్పటి నుంచి 10ఏండ్ల వయస్సు వరకు ఇచ్చే రెగ్యులర్ టీకాలు వారి ఆరోగ్య రక్షణకు ఎంతగానో తోడ్పడతాయంటున్నారు వైద్యనిపుణులు. ముఖ్యంగా చిన్నపిల్లలకు అంటు వ్యాధులు, ఇతర భయంకర వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయడం తప్పనిసరి అంటున్నారు పిల్లల వైద్యులు. పుట్టినప్పటి నుంచి 10 ఏండ్ల వయస్సు వరకు దశలవారీగా వారికి టీకాలు ఇప్పించాలని సూచిస్తున్నారు. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో పూర్తి ఉచితంగా టీకాలు వేస్తారని నిలోఫర్ ఆర్ఎంఓ డాక్టర్ రమేశ్‌బాబు దాంపురి తెలిపారు. పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఇటీవల ప్రభుత్వం పెంటా వ్యాక్సిన్‌ను కూడా ప్రవేశ పెట్టినట్లు ఆయన వివరించారు. ఐదు వ్యాక్సిన్ల సమూహాన్ని పెంటా వ్యాక్సిన్ అంటారు. అందులో డిప్టీరియా(డి), టెటనస్(టి), పెర్టసిస్(పీఏ), హెపటైటిస్-బి, హిబ్ అనే ఐదు రకాల వ్యాక్సిన్లు ఉంటాయన్నారు. ఈ పెంటా వ్యాక్సిన్ వేయడం వల్ల డిప్టీరియా వంటి భయంకర వ్యాధులతో పాటు కామెర్లు రాకుండా, పిల్లలకు గాలి, దుమ్ము తదితరాలతో ఏర్పడే తట్టు (అమ్మతల్లి) వంటి ఇన్‌ఫెక్షన్ల బారీ నుంచి రక్షణ ఇస్తాయన్నారు. సకాలంలో ఈ వ్యాక్సిన్ ఇప్పిస్తే పిల్లలకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ఉంటారని పేర్కొన్నారు. కొంత మంది తల్లిదండ్రులు తమ చిన్నారులకు వ్యాక్సిన్లు వేయించడంలో అశ్రద్ధ చేయడం, నిర్లక్ష్యం చేయడం జరుగుతుందని చెప్పారు. దీని వల్ల పిల్లలు వ్యాధులకు గురై తీవ్ర అనారోగ్యం పాలవుతున్నట్లు ఆయన తెలిపారు. సకాలంలో వ్యాక్సినేషన్ చేయిస్తే 90శాతం వ్యాధుల నుంచి పిల్లలను సంరక్షించుకోవచ్చని అన్నారు.

ప్రతి బుధవారం వ్యాక్సినేషన్ డే..

గ్రేటర్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి బుధవారం చిన్నారులకు వ్యాక్సిన్లను ఉచితంగా పంపిణీ చేస్తారు. ప్రతి శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. నిలోఫర్ వంటి ప్రసూతి, చిన్నపిల్లల దవాఖానల్లో ప్రతిరోజూ వ్యాక్సిన్లు, టీకాలను ఉచితంగా ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వ్యాక్సిన్ల వివరాలు:

- అప్పుడే పుట్టిన పిల్లలకు బీసీజీ, ఓపీవీ(ఓరల్ పోలియో వ్యాక్సిన్)
- 6వారాల వయస్సులో-పెంటా-1(డీ,పీ,సీ, హెపటైటిస్-బి, హిబ్)ఓపీవీ, ఐపీవీ-1
- 10వారాల వయస్సులో-పెంటా-2, ఓపీవీ
- 14వారాల వయస్సులో-పెంటా-3,ఓపీవీ, ఐపీవీ-2
- 9నెలల వయస్సులో-మిజిల్స్, ఓపీవీ
- 18నెలల వయస్సులో-మిజిల్స్ బూస్టర్ డోస్, డీపీటీ, ఓపీవీ
- 5ఏండ్ల వయస్సులో డీపీటీ, ఓపీవీ
- 10ఏండ్ల వయస్సులో డీటీ

చిల్.. అయిపోదాం..!

- ఉత్సాహం నింపుకొనేందుకు ఒకరోజు
- కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి వారాంతాలు, నెలాఖర్లలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఫామ్ హౌస్‌ల వైపు నగర యువత చూపు
- ఒత్తిడిని దూరం చేసుకుంటూ హుషారు

'అబ్బా.. నెలంతా టెన్షనే.. భరించలేక పోతున్నా..' 'అమ్మో వారానికి ఐదురోజులే అన్న మాటే గానీ.. పక్కోనితో నాలుగు ముక్కలు మాట్లాడేందుకూ టైం దొరుకుతలేదు' 'పిల్లలు స్కూల్‌కు పోగానే బయలుదేరాలి.. మళ్లీ ఇంటికొచ్చే సరికి పిల్లలు పడుకుంటున్నారు. అంతా రొటీన్'.. 'కాక.. పని భారం, ఒత్తిడి భరించలేకపోతున్నా..' ఇవీ ప్రైవేటు ఉద్యోగుల నుంచి వస్తున్న మాటలు.. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, సాఫ్ట్‌వేర్ కొలువులు చేస్తున్న వారి నోటి నుంచి ఎక్కువగా వినిపిస్తున్న పదాలు. అందుకే వారే అధికంగా కుదిరితే వారాంతాలు లేదా నెలాఖర్లలో చిల్ అయ్యేందుకు ఇష్టపడుతున్నారు. ఇందుకోసం నగర శివారుల్లోని ఫామ్ హౌస్‌ల వైపు చూస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారు. కుటుంబసభ్యులతో కొందరు, స్నేహితులతో మరికొందరు మజా చేసేందుకు బయలుదేరుతున్నారు.

పెద్దఅంబర్‌పేట, మార్చి 9 : సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఐదారు కుటుంబాలతో కలిసి ఎంజాయ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. 15 నుంచి 20 మంది వరకు ఒకేచోట సంతోషంగా గడిపేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. దంపతులిద్దరు ఉద్యోగాలు చేస్తున్న వారు.. ఇతర కుటుంబాలతో కలిసి వెళ్లడం, కలిసి దావత్‌లు చేసుకోవడం చాలా తక్కువయ్యాయి. పక్కనే ఇల్లు ఉన్నా.. చాలా అరుదుగా కనిపిస్తూ హాయ్ చెప్పే పరిస్థితులు ఉన్నాయి. మరోవైపు ఇంట్లోనే ఉంటున్నా.. భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగాలు చేస్తుండటంతో పిల్లలతో గడిపేందుకు సైతం సమయం ఉం డటంలేదు. ఈ నేపథ్యంలో ఇలాంటి వేదికలను పిల్లలతో గడిపేందుకు వినియోగిస్తున్నారు. ప్రేమగా వారితో మాట్లాడుతూ.. మంచి చెడులను వివరించేందుకు ఇదే మంచి ప్రదేశం, సమయమని భావిస్తున్నారు. సందడిగా ఆడిపాడుతూ సంతోషాలను పంచుకుంటున్నారు. ఒత్తిడిని దూరం చేసుకుంటూ ఉత్సాహాన్ని నింపుకొంటున్నారు.

నచ్చిన భోజనం..

వారాంతాలు, నెలాఖర్లలో ఫామ్ హౌస్‌లను బుక్ చేసుకుంటున్నవారు భోజన ప్రియులుగా మారుతున్నారు. కొందరు అన్ని వస్తువులు తెచ్చుకుని ఫామ్‌హౌస్‌లలోనే వండుకు తింటున్నారు. మరికొందరు ఫామ్‌హౌస్‌లలో అందుబాటులో ఉండే వంట మనుషులతో స్పెషల్‌గా వంటలు వండించుకుంటున్నారు. కొందరు మాత్రం ఇంట్లో వండాల్సిందే.. ఇక్కడా అంతేనా అంటూ గరిటలకు దూరంగా ఉంటున్నారు. వివిధ యాప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు వేడివేడిగా ఆహార పదార్థాలను ఆర్డర్ చేసుకుంటున్నారు. ఇలా అన్నియాప్‌ల ద్వారా ఆహార పదార్థాలు వచ్చే వీలున్న ఫామ్ హౌస్‌లనే ఎంచుకుంటున్నారు.

సండే స్పెషల్
SUNDAY SPECIAL

రోజుకు రూ.15 వేల నుంచి 20 వేల వరకు..

నగర శివారుల్లో ఫామ్ హౌస్‌లకు మంచి గిరాకీ ఉన్నది. ఫామ్ హౌస్‌లో రెండు నుంచి మూడు బెడ్‌రూంలు, హాల్, కిచెన్, హోం థియేటర్‌లు అందుబాటులో ఉంటున్నాయి. ఆవరణలో స్విమ్మింగ్ పూల్, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు అందుబాటులో ఉంచుతున్నారు. ఆయా ఫామ్ హౌస్‌లకు 24 గంటలకు తక్కువలో తక్కువ రూ.15 వేల నుంచి అందుబాటులో ఉన్నాయి. కొన్నిచోట్ల మరిన్ని వసతులు సమకూర్చి రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు. వారాంతాల్లోనే ఈ మొత్తాలు వసూలు చేస్తుండగా.. వారం మధ్యలో రూ.10 వేల నుంచి 15 వేలకు దొరకుతున్నాయి. అన్ని వసతులు ఉన్న ఫామ్ హౌస్‌లకు ఉద్యోగుల నుంచి మంచి ఆదరణ ఉంటున్నది. చాలామంది శుక్రవారం సాయంత్రమే ఫామ్ హౌస్‌లకు వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. 48 గంటల పాటు అక్కడ ఎంజాయ్ చేస్తున్నారు. తిరిగి ఆదివారం సాయంత్రం ఇండ్లకు బయలుదేరుతున్నారు.

ఎండల వేళ చల్లగా..

ప్రస్తుతం ఎండలు మండిపోతున్న ప్రస్తుత సమయంలో ఈ శివారుల్లోని పచ్చని, చల్లటి వాతావరణం ఉన్న ఫామ్ హౌస్‌లకు మంచి గిరాకీ ఉంటున్నది. స్విమ్మింగ్ పూల్, రెయిన్ డ్యాన్స్‌లు సైతం చాలా ఫామ్‌హౌస్‌లలో అందుబాటులో ఉన్నాయి. వేసవి నేపథ్యంలో చల్లటి వాతావరణం ఉండేవాటికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఈ తరహా వాటికి గిరాకీ పెరిగింది. ఫిబ్రవరి చివర, మార్చి మొదట్లోనే చిన్న పిల్లలకు సీబీఎస్ఈ పరీక్షలు పూర్తవడంతో ఇటు వైపు చూసే వారి సంఖ్య మరింత పెరిగింది. ఈ నెలాఖరు, వచ్చేనెల మొదటి వారంలో స్టేట్ సిలబస్‌లో చదువుతున్న పిల్లల పరీక్షలు పూర్తయ్యాక.. చిల్ అయ్యేందుకు యువ తల్లిదండ్రులు ముందుగానే ప్లాన్ చేస్తున్నారు. అందుకోసం తెలిసినవారి కొందరు సంప్రదిస్తుండగా.. ఆన్‌లైన్‌లోని పలు సైట్లను మరికొందరు ఆశ్రయిస్తున్నారు. ఏదైతేనేం అనుకున్న సమయానికి మంచి ఫామ్‌హౌస్ దొరికితే అదే పదివేలు అనుకుంటున్నారు.